క్లుప్తంగా

సీజేఐపై దాడికి నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని, తక్షణం అరెస్టు చేయాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళీ కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు వినత పత్రం అందజేశారు. ముఖ్య అతిథి, ఎంఎస్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ మాదిగ మాట్లాడుతూ గవాయ్‌పై దాడి దళితులపైనా, రాజ్యాంగంపైనా, ప్రజాస్వామ్యంపై దాడిగా భావిస్తున్నామని, ఈ దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఈసంపల్లి సిద్దు, బీఎస్ఎన్ఎల్ వెంకటేశ్వర్ రావు, రుద్రయ్య, హైమావతి, రమేషు, పాముల యేసు, బీఆర్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని పంచాయతీ కార్యదర్శులు



కలెక్టర్ వెట్రి సెల్వికి వినతి పత్రం ఇచ్చిన ఎస్సీ సర్పంచ్‌లు

ఏలూరు (టూటౌన్): గ్రామ పంచాయతీల్లో అధికారులు, కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెండెం సంతోష్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ వెట్రి సెల్వికి పలువురు ఎస్సీ సర్పంచ్‌లు వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని పంచాయతీ సర్పంచులకు తెలియకుండానే ప్రైవేటు వ్యక్తులు గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇది 1994 పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధమని సంతోష్ కుమార్ అన్నారు. పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్‌కు తెలియకుండా అధికారులు చెప్పకుండా ఒక దాత ఇచ్చిన డబ్బులతో ఆ గ్రామంలో ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఈ నెల 6న ప్రారంభించారని తెలిపారు. భవనం ప్రారంభ శిలాఫలకంపై సర్పంచ్ పేరు కూడా వేయలేదన్నారు. పోతునూరు సర్పంచ్ బొద్దుల స్వరూప్ మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించని అధికారులను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ని కోరారు.

ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యం

- ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్
- నకిలీ మద్యంపై ఏలూరులో ఆందోళన
- ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం



ఎక్సైజ్ జిల్లా అధికారి ఆవులయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జయప్రకాష్

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వ పాలనలో నకిలీ మద్యం తయారీ, విక్రయాలతో మహిళల పుస్తెలు తెంచేలా చేస్తున్నారని, ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చుతూ కుటుంబాలను నాశనం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నకిలీ మద్యంపై ఏలూరులో జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ధర్నా చేశారు. సెయింట్ ఆన్స్ కాలేజీ సెంటర్‌లోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ కొద్దిసేపు ధర్నా, కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. వర్షంలోనే అక్కడి నుంచి న్యూ అశోక్‌నగర్‌లోని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి, నిరసన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ఎ.అవులయ్యకు వినతిపత్రం అందజేశారు.

మద్యం మాఫియాపై భయాందోళన

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల బట్టబయలైన నకిలీ మద్యం తయారీ, సరఫరా మాఫియాను చూస్తే ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. స్పిరిట్, రసాయనాలతో తయారు చేస్తోన్న నకిలీ మద్యాన్ని, పెద్దపెద్ద బ్రాండ్స్ పేరుతో నకిలీ లేబుల్స్ వేసి వాటిని ప్రైవేటు మద్యం దుకాణాలు, బెల్టు షాపుల్లో విక్రయించటం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం కాదా అని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా ములకలచెరువు, ఎన్‌టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నంలో నకిలీ మద్యం తయారు చేసేది కూటమి నేతలే కావటం సిగ్గుచేటన్నారు. కూటమి 16 నెలల పాలనలో 421 మంది నకిలీ, కల్తీ మద్యం తాగి మరణించినట్టు మీడియా, సోషల్ మీడియాల్లో కథనాలు చూస్తున్నామని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో లిక్కర్ విధానాలు పారదర్శకంగా ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వమే లాభాపేక్ష లేకుండా మద్యం షాపులను తగ్గించి, సమయ పాలన పెట్టి మరీ విక్రయించిందని వివరించారు. నేడు 24/7 నిత్యం మద్యం అందుబాటులో ఉంటోందన్నారు. దీనిపై సీబీఐతో విచారణ చేయించాలని జేపీ డిమాండ్ చేశారు.

కూటమి నేతలకు రూ.కోట్లు

పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం మద్యం పాలసీలో మార్పులు తెచ్చి, కూటమి నేతలే మద్యం దుకాణాలు నిర్వహిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలకు విలువ లేదనీ, సీఎం చంద్రబాబు మద్యం విక్రయాలు పెంచాలంటూ అధికారులపై ఒత్తిడి తేవటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, జిల్లా ఉపాధ్యక్షురాలు చిలకపాటి డింపుల్ మాట్లాడుతూ ఏలూరు నగరంలోనూ ఒక వ్యక్తి మద్యం తాగుతూ చనిపోయాడని, ఇలాంటి ఘటనలు రోజూ రాష్ట్ర వ్యాప్తంగా అనేకం చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల మెడల్లో పుస్తెలు తెంచేలా కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం మాఫియాను పెంచి పోషిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలకు సరైన వైద్యం అందటం లేదు గానీ, మద్యం మాత్రం అందుబాటులో ఉందని విమర్శించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి దాసరి రమేష్, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘంటా మోహనరావు, గేదెల సూర్యప్రకాశరావు, క్రిస్టియన్ సెల్ నగర అధ్యక్షుడు గ్జేవియర్ మాస్టర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలారపు బుజ్జి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి భోగాది ప్రభాకర్, మరడా అనిల్‌కుమార్, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, జిల్లా విభాగాల అధ్యక్షులు స్టాలిన్‌బాబు, భోగిశెట్టి పార్వతి, ఐటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి లూటుకుర్తి సుభాష్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మట్టా రాజు, నగర ప్రధాన కార్యదర్శి కుప్పల ఆంజనేయులు, లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి, లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు బండ్లమూడి సునీల్‌కుమార్, ఏలూరు నగర విభాగాల అధ్యక్షులు ఘంటా సాయి ప్రదీప్, మద్దాల ఫణి, మేతర సురేష్, పిల్లంగోళ్ల సత్యదేవ్, కొవ్వాడ దుర్గారావు, యేసుపాదం, దాలి వెంకటేష్, పల్లి సత్యనారాయణ, బల్ల రమేష్, తులసీ వర్మ, రమేష్, దుర్గారావు, నక్క దినేష్, రుబీనా భేగం, సురేంద్ర, బట్టు విజయలక్ష్మి, కట్టా ఉమాదేవి, రాము, గుడివాక మోహన్, నామాల రమేష్, చుక్కా సత్యనారాయణ, బసవ, చిన్నారెడ్డి, కనకరెడ్డి, స్వామి, పార్టీ శ్రేణులు ఉన్నారు.

అభివృద్ధి ప్రణాళికలను పూర్తిచేయాలి



ఏలూరు(మెట్రో): ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజనలో ఆయా గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలపై గ్రామ అభివృద్ధి ప్రణాళికలను వెంటనే రూపొందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం ఆదర్శ్ గ్రామ యోజనలో గ్రామ అభివృద్ధి ప్రణాళికల ప్రతిపాదనల రూపకల్పన పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆది కర్మయోగి అభియాన్ రెండో దశలో ఎంపిక చేసిన 31 గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై విజన్ యాక్షన్ ప్లాన్‌లు పూర్తిచేసి గ్రామ సభలు నిర్వహించి ఆమోదానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెడ్పీ సీఈఓ శ్రీహరి, ఐటీడీఏ పీఓ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్సై మదీనా బాషా తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని కత్తేపువీధికి చెందిన పుప్పాల పవన్‌కుమార్ (40) లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారంలో భారీగా నష్టాలు రావటంతో అప్పుల బాధ తట్టుకోలేక ఆందోళనతో ఈనెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బంధువులు వెంటనే ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అతడ్ని విజయవాడలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పవన్‌కుమార్ విజయవాడలోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పవన్‌కుమార్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

వ్యాసాశ్రమ ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తిరుపతి జిల్లా ఏర్పేడులో శ్రీ వ్యాస ఆశ్రమం శతాబ్ది ఉత్సవాలను దిగ్విజయం చేయాలని వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి పిలుపునిచ్చారు. స్వామీజీ రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా సోమవారం ఏలూరు విచ్చేశారు. స్థానిక అగ్రహారం రామకోటి సమీపంలోని పాత శివాలయంలో ఆయనకు భక్తులు ఘన స్వాగతం పలికారు. స్వామీజీ అనుగ్రహ భాషణం, భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట శ్రీ వ్యాసాశ్రమ ఉత్తరాధికారి శ్రీ అసంగానంద గిరి స్వామీజీ ఉన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు కళా రత్న కేవీ సత్యనారాయణ, ప్రముఖ వ్యాపారవేత్త కేకే గుప్తా, కాకరాల రాజేంద్రవరప్రసాద్ (రాజ), మోటూరి వరలక్ష్మి, మురాల మాణిక్యాలరావు, వేణుగోపాల్ లునాని మాట్లాడారు. కళారత్న ఎ.పార్వతీ రామచంద్రన్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, సంగీత స్వర కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సామాజికవేత్త మానేపల్లి రామారావు, పలువురు భక్తులు ఆతిథ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి

వ్యక్తిపై ఇనుప రేకుతో దాడి

ఏలూరు టౌన్: అన్నదానం కార్యక్రమంలో పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తి మరో వ్యక్తిపై ఇనుప రేకుతో దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని టూటౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు టూటౌన్ పరిధిలో కనకదుర్గమ్మ ఉత్సవాలు సంబంధించి ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాత గొడవలు, కక్షల నేపథ్యంలో ఎడ్ల గణేష్ అనే వ్యక్తి సుందరపు గంగాధర్‌రావు అనే వ్యక్తిపై ఇనుప రేకుతో దాడి చేశాడు. ఈ దాడిలో గంగాధర్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి.

నేడు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో పారిశుద్ధ్య పనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీఎంఈఎఫ్), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మధులత సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, శాంతినగర్ సర్కిల్, డీఎంహెచ్‌ఓ ఆఫీస్ సర్కిల్, ఆదివారపు పేట సర్కిల్, తంగెళ్లమూడి అన్న క్యాంటీన్ సర్కిల్, కొత్తపేట నీళ్ల ట్యాంక్ సర్కిల్, గాంధీనగరం విమలాదేవి స్కూల్ సర్కిల్, రైతు బజార్ సర్కిల్, శనివారపేట సర్కిల్, వంగాయిగూడెం వెహికల్ డిపో సర్కిల్, చేపల చెట్టు సెంటర్ సర్కిల్, బావిశెట్టి వారి పేట సర్కిల్, శివనగర్ ఏరియాల్లో ప్రచారం చేశారు. కరపత్రాలు పంచారు. ఫెడరేషన్ ఏలూరు నగర గౌరవాధ్యక్షుడు బి.సోమయ్య, అధ్యక్షుడు లావేటి కృష్ణారావు, ఉపాధ్యక్షుడు తానంకి జార్జి, కాంతమ్మ, బండి భవాని, మేతర పాప, బంగారు వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటికి వినతి

ఏలూరు నగరంలోని 11, 30 డివిజన్లలో పారిశుద్ధ్య పనుల ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని, ఆప్కాస్ విధానం కొనసాగించాలని కోరుతూ ఏపీఎంఈఎఫ్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి)కి వినతి పత్రం అందజేశామని నాయకులు తెలిపారు.

ప్రైవేటీకరణను ఆపాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో 11, 30వ డివిజన్లలో వర్క్ ఔట్‌సోర్సింగ్ పేరుతో ప్రైవేటీకరణ విధానాన్ని నిలిపివేయాలని, ఆప్కాస్ ద్వారా మున్సిపల్ కార్మికుల నియామకాలను చేపట్టాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి అంగులూరి జానుబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కి సీఐటీయూ ప్రతినిధి బృందం ఎ.జానుబాబు, ఎం ఇస్సాకు, జె.గోపి, పి.రవి కుమార్‌లు వినతిపత్రం అందజేశారు.



ధర్నా విజయవంతం కోరుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	58	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	34
బెండకాయలు	28	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	48
బీరకాయలు	28	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	3౩
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

నీట మునిగిన ఏలూరు నగరం

- వీధులన్నీ జలమయం
- రోడ్లపైకి చేరిన డ్రెయిన్ల మురుగు
- వానొచ్చిన ప్రతిసారీ ఇదే దుస్థితి
- నగర ప్రజలకు అవస్థలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) / సాక్షి ఫొటోగ్రాఫర్ : సోమవారం ఉదయం 7.15 నుంచి దాదాపు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు ఏలూరు నగరం నీట మునిగింది. వాన ధాటికి వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో నగరంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. వీధుల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. డ్రెయిన్లలో సిల్టు పేరుకుపోవడంతో రోడ్లపైకి మురుగునీరు చేరింది. జనజీవనం స్తంభించింది. ఉద్యోగులు, విద్యార్థులు సమయానికి విధులకు హాజరు కాలేకపోయారు. ఉదయం 8.30 గంటలకే నగరంలో 21.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

జలమయం

విద్యా సంస్థల ప్రాంగణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, క్రీడా మైదానాలు, ఆర్టీసీ బస్టాండు వాన నీటితో నిండిపోయాయి. ఏలూరు నగరం చుట్టూ ప్రవహిస్తున్న తమ్మిలేరు, కృష్ణా కాలువ ఈ వాన నీటితో నిండుకుండల్లా మారాయి. ఒన్‌టౌన్‌లో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రెయినేజీలు ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ప్రయాణించాల్సి వచ్చింది. స్థానిక నరసింహరావు పేట, శాంతి నగర్, అమీనా పేట, రామచంద్రరావు పేట, కొత్తపేట, ఆదివారపు పేట, తంగెళ్లమూడి, ఇంద్రికగూడెం, పుష్పలీలానగర్, అశోక్ నగర్, పత్తేబాద, ఒన్‌టన్, బిర్లాభవన్ సెంటర్, వంగాయగూడెం, విజయలక్ష్మీ థియేటర్ ప్రాంతం, లక్ష్మీ వారపు పేట ఇలా ఏ ప్రాంతం చూసినా వీధులన్నీ వర్షం నీరు ప్రవహించింది.



వర్షపు నీటిలో మునిగిన ఆర్‌ఆర్‌పేట ప్రధాన రహదారి



శ్రీనివాస థియేటర్ మెయిన్ రోడ్డు



రిజిస్ట్రార్ కార్యాలయంలో



ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ జామ్ దృశ్యం



నీట మునిగిన వెంకట్రామ థియేటర్ రోడ్డు



వర్షపునీటిలో మునిగిపోయిన ఏలూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం



కొత్త బస్టాండులో నిలిచిపోయిన ప్రయాణికులు



గజ్జెలవారిచెరువు సెంటరులో పైకి లేచిన కంకర

1 నుంచి ఐఎఫ్‌టీయూ క్లాసులు

ఏలూరు (టూటౌన్): నవంబరు 1, 2, 3, 4 తేదీల్లో ఏలూరులో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర రాజకీయ తరగతులు, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ విజయవంతం కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వీవీనగర్ ఏరియాలో ప్రచారం చేశారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, నగర ప్రధాన కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు మాట్లాడారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేడు సీపీఆర్ ప్రాముఖ్యత, ఆవశ్యకత పెరిగిందని, విద్యార్థులతో పాటు యువత సీపీఆర్ చేయడం నేర్చుకోవడం ద్వారా ఎక్కువ మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడు సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబర్ 13 నుంచి 17 వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు కళాశాలల విద్యార్థులకు, ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రెడ్ క్రాస్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ ఎ.ప్రియాంక ఫార్మసీ విద్యార్థినులకు సీపీఆర్ చేసే పద్ధతులు, గుండెపోటు, అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు, ప్రొఫెసర్ ఎన్ శివరాం, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి

ఏలూరు (టూటౌన్): జనగణనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీ కులగణన కూడా చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో అక్టోబర్ 15న 10.30 గంటలకు స్థానిక స్ఫూర్తి భవనంలో బీసీ కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో బీసీ కులగణన జరిగిందని తెలిపారు.